క్లుప్తంగా

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



విరాళాన్ని ఈవో చంద్రశేఖర్‌కు అందజేస్తున్న దాతలు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారి ఆలయంలో అమలౌతున్న నిత్యాన్నదాన పథకానికి బలగ మడ్డివీధికి చెందిన జాక గురువులు, అచ్చమ్మ, గన్నమ్మలు సంయుక్త విరాళంగా 1,01116 రూపాయలను సమకూర్చారు. ఆలయ ఈవో ఎస్.చంద్రశేఖర్‌కు విరాళ నగదును బుధవారం అందజేశారు. ఈసందర్భంగా ఈవో మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి, అన్నదానానికి విరాళాలిచ్చిన భక్తులకు విశిష్ట పర్వదినాల్లో డోనర్ పాసులను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఇప్పిలి రంజిత్ శర్మ ఉన్నారు.

లైసెన్స్‌డ్ ఇంజినీర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షునిగా శ్రీనివాసరావు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): శ్రీకాకుళం పట్టణంలో ఒక హోటల్లో బుధవారం జిల్లా లైసెన్స్‌డ్ ఇంజినీర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం పట్టణ లైసెన్స్‌డ్ ఇంజినీర్స్ అసోసియేషన్‌ను జిల్లా సంఘంలో విలీనం చేశారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ముని శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా దుంగ సుధాకరరావు, ఇతర కార్యవర్గ ప్రతినిధులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా హారికా ప్రసాద్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

బాక్సింగ్ క్లబ్ ఏర్పాటు



బాక్సింగ్ క్రీడాకారులతో క్లబ్ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం నగరంలోని ఎన్టీఆర్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ క్రీడా మైదానంలో బుధవారం నూతన బాక్సింగ్ క్లబ్‌ను ప్రారంభించారు. సీనియర్ బాక్సింగ్ కోచ్ ఉమామహేశ్వరరావు నేతృత్వంలో బాస్కెట్‌బాల్ సీనియర్ కోచ్ జి.అర్జున్‌రావు రెడ్డి, క్లబ్ ప్రెసిడెంట్ నటుకులు మోహన్‌రావు తదితరులు బాక్సింగ్ క్లబ్‌ను ప్రారంభించారు. శిక్షణకు హాజరయ్యే విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి పట్టుదల, అంకితభావంతో సాధన చేయాలని సూచించారు. వీరికి రాష్ట్ర బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బలగ అనంత లక్ష్మణ్‌దేవ్ (అను) అభినందించారు. కార్యక్రమంలో సీనియర్ బాక్సర్లు రాజీవ్, చిన్ని, కొర్లయ్య, క్లబ్ కోచ్ రాము ఉన్నారు.

క్లాస్ వర్క్ పక్కాగా నిర్వహించాలి



ఇంజినీరింగ్ విద్యార్థులతో మాట్లాడుతున్న వీసీ రజిని

ఎచ్చెర్ల క్యాంపస్: క్లాస్ వర్క్ పక్కాగా నిర్వహించాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ కె.ఆర్.రజిని అన్నారు. వర్సిటీలోని ఏపీజే అబ్దుల్ కాలాం ఇంజినీరింగ్ కళాశాలను బుధవారం సందర్శించారు. కళాశాలలో మౌలిక వసతులు, ల్యాబ్‌లు, నీటి సరఫరా, మరుగుదొడ్లను పరిశీలించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వసతులు ఉండాలన్నారు. విద్యార్థులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

హోంగార్డు కుటుంబానికి సాయం



చెక్ అందజేస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా హోంగార్డు యూనిట్‌లో ఉంటూ రాజాం పోలీస్‌స్టేషన్‌లో విధి నిర్వహణలో మరణించిన హోంగార్డు కె.శ్రీనివాసరావు కుటుంబానికి అండగా ఉంటామని ఎస్పీ కె.వి. మహేశ్వరరెడ్డి తెలిపారు. జిల్లా హోంగార్డుల ఒక్క రోజు వేతనం రూ.4.11 లక్షల చెక్కును శ్రీనివాసరావు భార్య ఉదయకుమారికి బుధవారం అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ జి.ప్రేమ్‌కాజల్, ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీ శేషాద్రినాయుడు ఉన్నారు.

11న జిల్లా స్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఈ నెల 11న శ్రీకాకుళం రూరల్ మండలం మునసబ్‌పేట గురజాడ విద్యాసంస్థల కళాప్రాంగణం వేదికగా జరగనున్న జిల్లాస్థాయి వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలను విజయవంతం చేయాలని జిల్లా వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఐ.భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు తెలిపారు. సబ్ జూనియర్స్, జూనియర్స్ విభాగాల్లో బాలబాలికలకు, సీనియర్స్ విభాగంలో పురుషులు, మహిళలకు వేరువేరుగా పోటీలను నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ వెయిట్‌లిఫ్టింగ్ కోచ్ ఇప్పిలి అప్పన్న, పెద్దపాడులోని రెయ్యమ్మతల్లి వ్యాయామశాల సహకారంతో ఈ పోటీలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. వివరాలకు సెల్: 99498 61168 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

● సాగు పనుల్లో బిజీబిజీ



వాకలవలసలో నారును తీస్తున్న కూలీలు



నాట్లు వేసే పనిలో..



ఉబాలు చేస్తూ..

వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. దీంతో రైతులు బిజీబిజీగా ఉన్నారు. శ్రీకాకుళం రూరల్ మండలంలో 1400 హెక్టార్లలో వరినాట్లు వేసేందుకు అన్నదాత ఏర్పాట్లు చేసుకున్నారు. కొంతమంది పొలాలను దమ్ముచేసి సిద్ధం చేసుకోగా.. మరికొందరు నాట్లు వేసే పనుల్లో నిమగ్నమయ్యారు. రాగోలు, వాకలవలస, వప్పంగి, గూడెం, సింగుపురం, ఎస్.ఎస్.వలస, బైరివానిపేట పరిసర ప్రాంతాల్లో ఉబాలు జరుగుతున్నాయి.

–శ్రీకాకుళం రూరల్

మెట్టవలసలో ఇంటింటా సర్వే

జి.సిగడాం: మెట్టవలస గ్రామంలో అతిసార వ్యాధి అదుపులోనికి రాకపోవడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. బుధవారం ఉదయానికి మరో 15 డయేరియా కేసులు నమోదయ్యాయి. వీరిలో ఎక్కువ మంది చిన్నారులు, వృద్ధులు ఉన్నారు. వైద్య సిబ్బంది ఇంటింటా సర్వే చేస్తున్నారు. ఇప్పటికే ఐదు వైద్య బృందాలను ఏర్పాటు చేసి వైద్య సేవలను అందిస్తున్నారు. జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు గ్రామానికి చేరుకుని రోగుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి వీధిలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులను చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఎంపీడీఓ వెంకన్న బాబు, ఈఓపీఆర్డీఎస్ శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ బగాది భాగ్యలక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



గ్రామంలో పర్యటిస్తున్న డీపీఓ వెంకటేశ్వరరావు, అధికారులు

పరామర్శ..

రాజాం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులను ఎంపీపీ మీసాల వెంకటరమణ, డకర సురేష్‌కుమార్, దోల వెంకటరమణ, డకర సన్యాసినాయుడు, మాజీ సర్పంచ్ డకర రామకృష్ణ, డకర కృష్ణ పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు..

గ్రామంలోని తాగునీటి బోర్లు, బావుల్లో క్లోరినేషన్ చేయించారు. దోమలు, ఈగలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకుంటున్నారు. సర్పంచ్ కామొజుల అరుద్ర, ఎంపీటీసీ సభ్యురాలు బెవర విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి రాజారమేష్ పర్యవేక్షించారు. రాజాం మున్సిపాలిటీ నుంచి ప్రత్యేక వాహనాల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు.



రాజాం ఆస్పత్రిలో రోగులను పరామర్శిస్తున్న ఎంపీపీ, నాయకులు

విద్యుత్ సరఫరా నిలుపుదల రేపు

అరసవల్లి: శ్రీకాకుళం నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ మరమ్మతులు చేపడుతున్న కారణంగా శుక్రవారం సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఆపరేషన్స్ ఈఈ ఎస్.బయ్యన్నాయుడు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం నగర పరిధిలో విశాఖ-ఏ కాలనీ, బ్యాంకర్స్ కాలనీ, జి.టి.రోడ్డు, పెద్దపాడు, పెద్దపాడు రోడ్డు, మేజర్స్ కాలనీ, ఫ్రెండ్స్ కాలనీ, ఆర్టీసీ కాలనీ, జామితోట తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తారు. శ్రీకాకుళం రూరల్ మండలం పరిధిలో నైర, పొన్నాం, బట్టేరు, నవనంబాడు, గొల్లపేట, బమ్మిడివానిపేట, వెంకటాపురం, రోణంకి, కరిమిల్లిపేట, చల్లపేట, రామకృష్ణాపురం, కల్లేపల్లి, మోపసుబందరు, జాలరీపేట, సాధుపేట, పేజీపేట, చిన్నగనగళ్లవానిపేట, పుక్కళ్లవానిపేట, కాజీపేట, నరసయ్యపేట, పరదేశీపాలెం, కిల్లిపాలెం తదితర ప్రాంతాల్లో వ్యవసాయ పొలాలకు ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా ఉండదు. గార మండలంలో గార, బూరవల్లి, శాలిహుండం, జోగిపంతులుపేట, పూసర్లపాడు, కొత్తపేట తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సరఫరాను నిలిపి వేస్తారు.

రణస్థలం: మండలంలోని రణస్థలం సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం అత్యవసర మరమ్మతులు, చెట్ల కొమ్మలను తొలగించనున్నారు. ఈ మేరకు విద్యుత్‌శాఖ ఈఈ బయ్యన్నాయుడు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జే.ఆర్.పురం, రణస్థలం, గరికిపాలెం, బావరాజుపాలెం, దన్నానపేట, వైఎస్సార్‌కాలనీ, గోసాం ఫీడర్ పరిధిలోని కృష్ణాపురం, మహంతిపాలెం, గొర్లెపేట, చుక్కపేట, లంకపేట, ఎన్‌జీపురం, తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

జిల్లాకు ఆదర్శంగా ఉండాలి



సంఘ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

గార: మండల శిష్టకరణ సంఘం జిల్లాకు ఆదర్శంగా నిలవాలని రాష్ట్ర శిష్టకరణ సంఘం అధ్యక్షుడు పోలుమహంతి ఉమామహేశ్వరరావు అన్నారు. మండల శిష్టకరణ సంఘం తాత్కాలిక కార్యాలయాన్ని శ్రీకూర్మం జంక్షన్‌లోని ఓ కల్యాణ మండపంలో జిల్లా అధ్యక్షుడు డబ్బీరు శ్రీనివాసరావుతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా శిష్టకరణ సంఘం శాశ్వత భవనం నిర్మాణానికి బీవీఆర్ సంస్థల అధినేత బలివాడ రేణుకాదేవి రూ. లక్ష ఇస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శి సదాశివుని కృష్ణ, నగర అధ్యక్షులు బెహరా రామచంద్రరరావు, జిల్లా నాయకులు కల్లేపల్లి వెంకటేశ్వరరావు, ఎస్‌వీడీ మురళీ, నౌపాడ నర్సింగరావు, మండల సంఘం అధ్యక్షుడు శాలిహుండం రామకృష్ణ, కార్యదర్శి సాయిరాం ఉన్నారు.

పారా బ్యాడ్మింటన్ క్రీడాకారునికి చేయూత

శ్రీకాకుళం: అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న టెక్కలి వాసి చాపర పూర్ణారావుకు కేంద్ర పౌర విమానయాన శాఖమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అండగా నిలిచారు. సెప్టెంబర్‌లో ఇండోనేషియాలో జరగనున్న అంతర్జాతీయ పారా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌కి ఎంపికైన పూర్ణారావు ఆ పోటీలలో పాల్గొనేందుకు పేదరికంతో దాతల సాయం కోసం ఎదురు చూస్తున్నాడు. ఈ నెల 4న కేంద్రమంత్రిని కలిసి సమస్యను వివరించగా.. డ్రీమ్ లెవెన్ క్రీడా సంస్థ ప్రతినిధులతో మాట్లాడి వంద శాతం స్పాన్సర్ షిప్ మంజూరు చేయించారు. ఇండోనేషియా పర్యాటనకు అవసరమైన రూ.1.5 లక్షల నిధులను కేటాయింప చేశారు.

ముగిసిన ధ్యానం శిక్షణ

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం సమీపంలోని ఓ కల్యాణ మండపంలో 41 రోజులుగా నిర్వహిస్తున్న ఉచిత సామూహిక ధ్యానంపై శిక్షణ బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా పిరమిడ్ స్పిరిట్యువల్ సొసైటీ సీనియర్ పిరమిడ్ టీచర్లు శివరామకృష్ణ, ప్రవీణ్‌లు మాట్లాడుతూ.. ధ్యానం చేస్తే ఆరోగ్యంతోపాటు ఆనందం లభిస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా యోగాచార్య రామారావు, నేత్రవైద్యులు కె.పి.నాయుడు, ఓంశాంతి సిస్టర్స్ నిర్మల, జయలక్ష్మిలను సత్కరించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం టీచర్లు కోపూరి బిందు మాధవి, బాలాజీరావు, శివ ఉన్నారు.

రుచి, శుచి తప్పనిసరి

జి.సిగడాం: విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం పథకం ద్వారా రుచికమైన ఆహారం వండిపెట్టాలని ఎంఈఓలు అరసాడ రవి, ముళ్ల శ్రీనివాసరావు అన్నారు. మెట్టవలస ప్రభుత్వ పాఠశాలను బుధవారం తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరులను పరిశీలించారు. హెచ్‌ఎం గీత, సిబ్బంది ఉన్నారు.

స్వామినాథన్‌కు ఘనంగా నివాళి

గార: హరిత విప్లవ పితామహుడు డాక్టర్ ఎం.ఎస్.స్వామినాథన్ కృషి ఎనలేనిదని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ డిప్యూటీ మేనేజర్ ఆర్.హరిబాబు అన్నారు. స్వామినాథన్ జయంతిని వాడాడ పంచాయతీ రెడ్డిపేటలో రైతులతో కలిసి బుధవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం హరిబాబు మాట్లాడుతూ.. వాతావరణ మార్పుల వలన ప్రపంచ వ్యాప్తంగా ఆహార ధాన్యాల ఉత్పత్తి, దిగుబడులు తగ్గుతున్నా భారతదేశంలో ఆహార కొరత లేకపోవడానికి కారణం స్వామినాథన్ కృషివలనే సాధ్యమయ్యిందన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సు చేసిన విధంగా సేద్యం వైపు యువత ఆకర్షించాలన్నారు. వ్యవసాయం లాభసాటిగా మార్చే చర్యలు చేపట్టాలన్నారు.



స్వామినాథన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

సీడ్‌డ్రిల్ యంత్రంతో సాగు చేసిన వరి ప్రదర్శన క్షేత్రాన్ని సందర్శించారు. పురుగులు, తెగుళ్ల బెడద తక్కువగా ఉండటమే కాకుండా మేలైన దిగుబడులు సాధించవచ్చని ఏరియా మేనేజర్ పి.తవిటినాయుడు అన్నారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ ఎస్.అప్పల సూర్యనారాయణ, రైతులు బిన్నాడ రమణ, లక్ష్మణరావు, సిమ్మ జ్యోతి, నక్క లక్ష్మణ, సీర శ్రీను ఉన్నారు.

సమన్వయంతో ఈ-పంట నమోదు

శ్రీకాకుళం పాతబస్టాండ్: వ్యవసాయ, ఉద్యాన, రెవెన్యూ, సర్వే సహాయకులు సమన్వయంతో ఈ-పంట నమోదు చేస్తామని జిల్లా వ్యవసాయ శాఖాధికారి కె.శ్రీధర్ తెలిపారు. ఈ-పంట నమోదుకు సంబంధించి స్పెషల్ చీఫ్ సెక్రటరీ బుడితి రాజశేఖర్ అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ రోజుకు 50 ఎకరాలకు తక్కువ కాకుండా క్షేత్ర స్థాయిలో పరిశీలన, నమోదు చేపడుతున్నామన్నారు. యాప్‌లో నమోదైన వివరాలతో సరిపోల్చుకుని జియో కో ఆర్డినేటర్లతో పంటల ఫొటోలు తీసి అప్‌లోడ్ చేస్తున్నట్లు వివరించారు.



వీసీలో పాల్గొన్న వ్యవసాయశాఖ జేడీ, అధికారులు

రైతు వేలిముద్ర తీసుకుని ఫోన్ నంబర్‌కు డిజిటల్ రసీదు జారీ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖాధికారి ఆర్.వి.ప్రసాద్, మత్స్యశాఖ డీడీ శ్రీనివాస్, సెరీకల్చర్ ఏడీ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా కళాశాలలో సెల్ అండ్ సీక్ వర్క్‌షాపు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్) కళాశాలలో ఐదు రోజులపాటు జరిగే 'సెల్ అండ్ సీక్' వర్క్‌షాప్ బుధవారం ప్రారంభమైంది. ఉన్నత విద్యాశాఖ కమిషనర్ ఈ వర్క్‌షాప్‌ను ఆన్‌లైన్‌లో ప్రారంభించారు. తొలిరోజు జిల్లా నలుమూలల నుంచి హాజరైన తెలుగు, హిందీ, సంస్కృతం అధ్యాపకులకు ఉద్దేశించి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు మాట్లాడుతూ ఇటువంటి సదస్సుల నిర్వహణ అధ్యాపకులకు ఎంతో అవసరమన్నారు. ఫిజిక్స్ లెక్చరర్ డాక్టర్ బి.రాధాకృష్ణ కోఆర్డినేటర్‌గా, డాక్టర్ జి.రవికుమార్, డాక్టర్ ఎస్.ఢిల్లేశ్వరరావు, డాక్టర్ బి.ప్రభాకరరావు, లలితాకుమారి, డాక్టర్ ఆర్.రవిశంకర్, ఓ.కోటేశ్వరరావు, డాక్టర్ ఆర్.శ్రీనివాసరావు పాత్రో, ఓ.రామారావు తదితరులు రిసోర్స్ పర్సన్స్‌గా వ్యవహరించారు.



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్ర

విద్యార్థినికి సైకిల్ వితరణ

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక పీఎన్ కాలనీకి చెందిన లక్ష్మణరావు లివర్ క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. దీంతో అతని కుటుంబం ఆర్థిక కష్టాలను ఎదుర్కొంటుంది. అయితే అతని కుమార్తె చదువుకు ఆటంకం లేకుండా రాగోలుకు చెందిన జరుగుళ్ల రాజు ఆలోచన చేసి సైకిల్‌ను సమకుర్చారు. ఎమర్జెన్సీ బ్లడ్ సర్వీస్ ప్రతినిధి నంది ఉమాశంకర్ ద్వారా విద్యార్థిని అవసరాన్ని తెలుసుకున్న రాజు సైకిల్‌ను బుధవారం అందించారు. మదర్స్ లవ్ ప్రతినిధి సుప్రజ, ఉర్లం శివతేజ, సిక్కోలు స్వచ్ఛంద సేవా సమితి పోడుగు చరణ్, రత్నాల మహాలక్ష్మి, అల్లాడ నవీన్ ఉన్నారు.

మాజీ సీఎం జగన్‌ను కలిసిన శ్రీకాంత్

శ్రీకాకుళం పీఎన్ కాలనీ:

మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని తన కార్యాలయంలో తూర్పుకాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్ మామిడి శ్రీకాంత్ మర్యాద పూర్వకంగా బుధవారం కలిశారు. ఆయనతోపాటు పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఎం.వి.స్వరూప్ ఉన్నారు.



జగన్‌మోహన్‌రెడ్డితో శ్రీకాంత్, స్వరూప్

వర్సిటీలో పుస్తకావిష్కరణ

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్స్ విభాగం అధ్యాపకుడు మజ్జి రామారావు బృందం రూపొందించిన వ్యవస్థాపక ప్రాథమిక అంశాలు (ఫండమెంటల్ ఆఫ్ ఎంట్రప్రెన్యూర్‌షిప్) అనే పుస్తకాన్ని వైస్ చాన్స్‌లర్ కె.ఆర్.రజిని బుధవారం తన చాంబర్‌లో ఆవిష్కరించారు. బోధన రంగంలో ఉన్న అధ్యాపకులు పరిశోధన, నూతన ఆవిష్కరణలు, రచనలకు ప్రాధాన్యమివ్వాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో రెక్టార్ అడ్డయ్య, రిజిస్ట్రార్ సుజాత పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ రజిని, అధికారులు

ప్రధాన కూడళ్ల పరిశీలన

శ్రీకాకుళం క్రైమ్: శ్రీకాకుళం నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యల్లో భాగంగా జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి బుధవారం సాయంత్రం పలు ముఖ్యకూడళ్లు, మార్కెట్ ప్రదేశాలను పరిశీలించారు. రూరల్ సీఐ లెంక సన్యాసినాయుడు, రెండో పట్టణ సీఐ గుండుమోను ఉమామహేశ్వరరావు, ట్రాఫిక్ ఎస్ఐ వి.సందీప్ కుమార్‌లతో కలిసి పొట్టి శ్రీరాములు కూడలి, ఇలిసిపురం రైతు బజారు, గుజరాతీపేట హయాతీనగరం మార్కెట్ ప్రదేశాలను పరిశీలించారు. పీఎస్ఆర్ జంక్షన్‌లో ఆటో డ్రైవర్లతో మాట్లాడుతూ.. నిర్దేశించిన ప్రదేశాల్లోనే ఆటోలు నిలపాలని, ప్రజా రవాణాకు ఎటువంటి అంతరాయం లేకుండా వ్యవహరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఆదేశించారు. నిబంధనల మేరకే పిల్లలను ఆటోల్లో ఎక్కించుకోవాలన్నారు. రైతు బజారు వద్ద వాహనాల రాకపోకలు, పార్కింగ్ వంటి అంశాలపై నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులతో..

స్థానిక మహిళా డిగ్రీ కళాశాల వద్ద విద్యార్థినులతో ఎస్పీ మాట్లాడారు. కళాశాలకు వెళ్లి వచ్చేటప్పుడు ఆకతాయిల నుంచి ర్యాగింగ్, ఈవిటీజింగ్ సమస్యలు ఉంటే తన నంబర్ 63099 90800కు తక్షణమే డయల్ చేయాలన్నారు. కళాశాల పరిసరాల్లో నిరంతరం పోలీస్ పెట్రోలింగ్ చేయించాలని అధికారులను ఆదేశించారు.

ఎస్పీని కలిసిన సీఐలు



ఎస్పీకి పూలకుండీని బహూకరిస్తున్న సీఐ అవతారం



ఎస్పీని కలిసిన సీఐ ప్రసాద్

శ్రీకాకుళం క్రైమ్: సాధారణ బదిలీల్లో భాగంగా ఇటీవల జే.ఆర్‌పురం, కొత్తూరు సీఐలుగా బాధ్యతలు స్వీకరించిన మట్టాల అవతారం, చింతాడ ప్రసాద్‌లు జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డిని బుధవారం రాత్రి మర్యాదపూర్వకంగా కలిశారు. ఇరువురు సీఐలతో ఎస్పీ మాట్లాడుతూ.. సర్కిళ్ల పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలు, నిర్వహించాల్సిన విధులు, బాధ్యతలపై దిశా నిర్దేశం చేశారు.

సంక్షిప్తంగా...

నివాళులు..



అయ్యప్పలనాయుడు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కిరణ్‌కుమార్, నాయకులు

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని చిన్నమురపాక గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, చిన్నమురపాక ఎంపీటీసీ సభ్యుడు సిరుపురపు రాంబాబు తండ్రి అయ్యప్పలనాయుడు ఇటీవల మృతి చెందారు. బుధవారం గ్రామంలో నిర్వహించిన పెద్ద కర్మలో మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పాల్గొని, అయ్యప్పలనాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జెడ్పీటీసీ సభ్యుడు మీసాల సీతంనాయుడు, జేసీఎస్ ఇన్‌చార్జి మీసాల శ్రీనివాసరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

శ్రీకాకుళం కల్చరల్: పాతశ్రీకాకుళం ఎస్సీ వీధిలోని కమ్యూనిటీ హాల్‌లో బుధవారం ఉచిత కంటి, జనరల్ వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. విశాఖకు చెందిన సెయింట్ మదర్‌థెరిసా ఎవర్‌గ్రీన్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరాల్లో జెమ్స్ ఆస్పత్రి వైద్యులు రాజేష్, అప్పలకొండ, సహాయకులు నాగరాజు, ఫార్మసిస్టు సీతారాం, ఏరియా మేనేజర్ బి.రవిబాబులు హాజరై 60 మందికి వైద్య పరీక్షలు చేశారు. వారికి మందులు ఉచితంగా సరఫరా చేశారు. పది మందిని నేత్ర శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు కె.ప్రసాదరావు, కె.తేజస్విని, కె.జ్ఞానరాజు, ప్రేమ్‌కుమార్, ఫ్రాన్సిస్, పాస్టర్ స్టీవెన్ పాల్గొన్నారు.

చేనేత వస్త్రాలు ధరించాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీకాకుళం నగరంలో బీజేపీ జిల్లా శాఖ, చేనేత సెల్ విభాగం, వివిధ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. చేనేత వస్త్రాలను ధరించి చేనేత కార్మికులను ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పూడి తిరుపతిరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అట్టాడ రవి బాబ్జీ, లయన్స్ క్లబ్ చాప్టర్ చైర్మన్ నటుకుల మోహన్, లయన్స్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు, బీజేపీ డాక్టర్స్ సెల్ కన్వీనర్ డాక్టర్ బొడ్డేపల్లి సురేష్, డాక్టర్ సిందూర, జేసీఐ గ్రీన్ సిటీ ప్రెసిడెంటు డి.వరలక్ష్మి, తమ్మినేని ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులను ఆదుకుంటాం

ఎచ్చెర్ల: చేనేత వృత్తిదారులను అన్ని విధాలా ఆదుకుంటామని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకుని అప్పాపురంలో చేనేత కార్మికుల ఇళ్లకు వెళ్లి శుభాకాంక్షలు తెలియజేశారు. స్వదేశీ ఉద్యమానికి గుర్తుగా జాతీయ చేనేత దినోత్సవం నిర్వహించుకుంటున్నామన్నారు. మగ్గంపై పనిచేసే నేతన్నలను సన్మానించారు. చేనేత కార్మికుల సమస్యలపై అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామన్నారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

రూ.91 వేల ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న కానిస్టేబుళ్లు

రణస్థలం: జే.ఆర్.పురం పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తూ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కానిస్టేబుల్ నడికట్ల సతీష్ కుటుంబానికి 2004 బ్యాచ్ కానిస్టేబుళ్లు బుధవారం రూ.91,000 ఆర్థిక సహాయం చేశారు. విజయనగరంలో నివాసం ఉంటున్న ఆయన కుటుంబ సభ్యులకు ఈ మొత్తాన్ని అందజేశారు.